క్లుప్తంగా

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



కొంకుదురు అంగన్‌వాడీ కేంద్రం వద్ద పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచ్ సత్తి వీరమణి

బిక్కవోలు: గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొంకుదురు గ్రామ సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. బుధవారం కొంకుదురు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద లబ్ధిదారులకు ఆమె పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు రోజూ ఆహారంలో ఆకుకూరలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి నెల 9వ తేదీన ప్రధానమంత్రి మాతృ సురక్ష యోజనలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలోని సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ కొంకుదురు పీవీ తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి



బిక్కవోలులో చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

బిక్కవోలు: బిక్కవోలులోని భవిత కేంద్రం వద్ద డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ కె.శ్రీనివాసరావు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ తనలాంటి అంధుల కోసం బ్రెయిలీ లిపిని కనిపెట్టి వారు విద్యావంతులుగా తయారవ్వడానికి దోహదపడ్డారని చెప్పారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సన్యాసిరావు, సీఆర్‌పీ మాధవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు



శ్రీరంగపట్నం హైస్కూల్లో పరిశీలిస్తున్న ఎంఈవో కుశలవ దొర

మధురపూడి: సమ్మెటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. శ్రీరంగపట్నం హైస్కూల్లో పరీక్షను ఎంఈఓ కుశలవ దొర పరిశీలించారు.

సారా తయారీ, రవాణాపై కఠిన చర్యలు



రంగంపేటలో మహిళా పోలీస్‌లతో మాట్లాడుతున్న సీఐ వెంకటలక్ష్మి

రంగంపేట: మండలంలో ఎవరైనా సారా తయారీ, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి హెచ్చరించారు. స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో బుధవారం మహిళా పోలీస్‌లతో ఆమె సమావేశం నిర్వహించారు. సారా, గుట్కా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిపై తీసుకోవలసిన చర్యలపై మహిళా పోలీస్‌లకు వివరించారు. మండలంలోని ఈలకొలను గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. సారా తయారీకి బెల్లపుఊట తయారుచేసిన వారిని గుర్తించి వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

టీటీడీ ప్రచార రథానికి ఘన స్వాగతం



నల్గొండలో ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సీతానగరం: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార రథానికి బుధవారం నల్గొండ గ్రామంలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. వీధుల్లో పసుపు నీరు చల్లుతూ స్వామివారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. ముందుగా మంగళవారం రాత్రి గ్రామంలోని రామాలయం వద్దకు రథం చేరుకుంది. ప్రచార రథం ప్రెసిడెంట్, గాయకుడు కరుటూరి వెంకట శ్రీనివాసరావు అన్నమాచార్య సంకీర్తనలు అద్భుతంగా ఆలపించారు. బుధవారం తెల్లవారుజామున పూజల అనంతరం నల్గొండ వీధుల్లో పర్యటించింది. సాయంత్రానికి సీతానగరం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్దకు చేరుకుంది.

పింఛన్ల పెంపు చారిత్రాత్మకం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: సామాజిక పింఛన్ల పెంపు నిర్ణయం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొలమూరు శివారు చినపొలమూరు దేవస్థానం కాలనీలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శెట్టి బలిజ కల్యాణ మండపం ప్రాంగణంలో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు పెంచి అవ్వాతాతలు, అక్కచెల్లమ్మల మోముల్లో ఆనందం పంచారన్నారు. కోవిడ్ సంక్షోభం నుంచి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కోలుకోకపోయినా సంక్షేమ పథకాలను నిరాటంకంగా కొనసాగిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత మొత్తంలో పింఛన్లు అందించడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నప్పటికీ లబ్ధిదారులు జన్మభూమి కమిటీ సభ్యుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. నేడు పింఛను కోసం పడిగాపులు పడాల్సిన పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖ చిట్టిరాజు, ఎంపీడీఓ బీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



దుప్పలపూడిలో స్థానిక మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అనపర్తి: అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాల్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దుప్పలపూడిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులిస్తూ ఘన స్వాగతం పలికారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి గత మూడున్నరేళ్లలో కలిగిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు.

సీఎం జగనన్న పాలనపై ప్రజల పూర్తి సంతృప్తి

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం అందించే సాయం అందని ద్రాక్షలా ఉండేదన్నారు. పేద మధ్య తరగతి ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా స్వయంగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పాలనకు నాంది పలికారని చెప్పారు. ఎన్నికల ముందు నవరత్నాల పేరుతో ఇచ్చిన అన్ని హామీలను మూడున్నరేళ్లలో అమలు చేశారని తెలిపారు. గ్రామంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజల ముందుకు వచ్చానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లమిల్లి సావిత్రి అబ్బన్నరెడ్డి, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండా ప్రేమలత, పార్టీ నాయకులు కోనాల సాయిరామారెడ్డి, మాజీ ఎంపీటీసీ చిత్సారపు బాపిరాజు, పంచాయితీ కార్యదర్శి కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజా పరామర్శ



నర్సాపురంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలంలోని పలువురు మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. నర్సాపురానికి చెందిన ఇంటి నారాయణ భార్య బుల్లియ్యమ్మ, రాఘవపురంలోని నత్తల సత్యనారాయణ తండ్రి సింహాచలం, సింగంపల్లి శ్రీనివాస్ నానమ్మ సోములమ్మ, శ్రీరంగపట్నంలో పెంటకోటి సత్యనారాయణ భార్య నాగమణి, అప్పన్నదొర తల్లి నరసారత్నం ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రాజా పరామర్శించారు. ఆయన వెంట సర్పంచుల సమాఖ్య కోరుకొండ మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, వైఎస్సార్ సీపీ నాయకులు చొంగా శివయ్య, మద్దాల రమణ, నత్తల సత్యనారాయణ, సింగంపల్లి శ్రీను, బుద్దా శ్రీను పాల్గొన్నారు.

శ్రీకృష్ణపట్నంలో..

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు డి.సూర్యనారాయణ, ఉల్రింకల శ్రీను ఉన్నారు.

తలెత్తుకుని తిరిగేలా సంక్షేమ పాలన



పందలపాకలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ పద్మావతి



జి.మామిడాడలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ కేతా తులసి



రంగంపేట పింఛన్ పంపిణీ సభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకులు తలెత్తుకుని తిరిగేలా రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి అన్నారు. మండలంలోని పందలపాక, కొంకుదురు, తొస్సిపూడి గ్రామాల్లో బుధవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛన్లు తొలగిస్తున్నారంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మొద్దన్నారు. పేదల సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ ఆశీస్సులను అందించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ మచ్చాపాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, కొంకుదురులో సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడి రాజా తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో పేదల కుటుంబాల్లో ఆనందం

పెదపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్లను పెంచడంతో పేద కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతుందని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. పెదపూడి మండలంలోని 20 సచివాలయాల్లో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించారు. జి.మామిడాడలో ఎంపీపీ కేతా తులసి, కాండ్రేగులలో జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మిలు మాట్లాడుతూ మండలంలో సామాజిక పింఛన్లు 10273 ఉన్నాయని, వాటితో పాటు నూతనంగా మంజూరైన 269 మొత్తం 10542 పింఛన్లు అందించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా తీసుకుని పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు.

అవ్వాతాతల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

రంగంపేట: అవ్వాతాతల ఆనందమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. రంగంపేట, సుభద్రంపేట గ్రామాల్లో బుధవారం కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. మర్రిపూడి గ్రామంలో ఎంపీపీ రిమ్మలపూడి సత్య శ్రీదేవి, గ్రామ సర్పంచ్ వేము మాధవి కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జి.దొంతమూరు గ్రామంలో సర్పంచ్ గోలి రమణ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి కొత్త పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీడీఓ బి.కృష్ణగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శనీయం



కొంకుదురులో మహిళా ఉపాధ్యాయినిలను సత్కరించిన ఉపాధ్యాయులు

బిక్కవోలు: సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయమని కొంకుదురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అమ్మిరెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా ఆమె ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా ధైర్యంగా నిలబడి గొప్పస్థాయికి ఎదిగారని, ఆమెను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయినిలు చాగంటి వాణిసులోచన, మాచవరపు శిరిష, నేకూరి నిర్మలా జ్యోతిలను ఘనంగా సత్కరించారు.

టిష్యూ కల్చర్ లాబ్, డిజిటల్ లైబరీ ప్రారంభం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన టిష్యూ కల్చర్ లాబ్, డిజిటల్ లైబరీలను వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు బుధవారం ప్రారంభించారు. ఎంచుకున్న స్పెషలైజేషన్ కోర్సుల్లో విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, టిష్యూ కల్చర్‌లో ఆధునిక పద్ధతులను ఉపయోగించి పరిశోధనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. డిజిటల్ లైబరీలో ఇంటర్నెట్ సదుపాయంతో 25 కంప్యూటర్లు ఉంటాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్, బుక్స్, ఆన్‌లైన్ పరిశోధనలకు విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ఆక్వాపోనిక్స్, అజొల్లా కల్చర్ (గ్రీన్ టెక్నాలజీ), వివిధ రకాల చేపల పెంపకానికి సంబంధించిన యూనిట్లను సందర్శించి, విద్యార్థులను ప్రతిభను కొనియాడారు. ఓఎస్డీ ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ కేవీ స్వామి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనపర్తి: పీరారామచంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్ మరమ్మతుల పనులు నిర్వహిస్తున్న కారణంగా ఈ నెల 6వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పీరారామచంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, ఇండస్ట్రియల్ సర్వీసులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'నన్నయ'లో సంక్రాంతి వేడుకలు



నన్నయ ప్రాంగణంలో ముగ్గుల పోటీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా ప్రారంభించారు. పండగల విశిష్టతను తెలియజేసేలా తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరుపుకొంటున్న ఈ సంబరాలను ఈసారి కాస్త ముందుగానే చేపట్టారు. విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలిరోజు సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలో 123 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. గురు, శుక్రవారాలలో కూడా ఈ సంబరాలు కొనసాగుతాయి. భోగి మంటలు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసు కీర్తనలు తదితర వాటిని ప్రదర్శించనున్నారు.

ఇంటి పన్నులు.. రికార్డు వసూళ్లు

- 15 రోజుల్లో శత శాతం ఇంటి పన్నుల వసూలు

అనపర్తి: గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లలో మండలంలోని కొప్పవరం వలంటీర్లు వరుసగా రెండో ఏటా తమ సత్తా చాటారు. సాధారణంగా పంచాయితీలు జనవరి నెల ప్రారంభం నుంచి ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేసి మార్చి నెలాఖరులోపు పన్నులు వసూలు చేస్తుంటారు. అయితే కొప్పవరం గ్రామ పంచాయితీ పరిధిలో ఇంటి పన్నుల వసూలుకు బిల్లు కలెక్టర్ లేకపోయినా వలంటీర్లు పన్నుల వసూలు బాధ్యతగా తీసుకుని కేవలం 15 రోజుల్లోనే 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించినట్లు పంచాయతీ కార్యదర్శి తాడి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఇంటిపన్నుల మొత్తం డిమాండ్‌ను రూ.6,13,846 కేవలం 18 రోజుల్లో వసూలు చేసి రికార్డు నెలకొల్పిన వలంటీర్లు 2022–2023 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.8,13,212 మొత్తం లక్ష్యాన్ని కేవలం 15 రోజుల్లోనే వసూలు చేసి రికార్డును తిరగరాశారన్నారు. డిసెంబరు 21న పన్నుల వసూళ్లు ప్రారంభించిన వలంటీర్లు జనవరి 4వ తేదీ నాటికి నూరుశాతం పన్నుల వసూళ్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

పంట నమోదు సక్రమంగా చేయాలి



రిని, ఉద్యానశాఖ అధికారి

మధురపూడి: రబీ సీజన్‌లో కూరగాయల పంట నమోదును సక్రమంగా నిర్వహించాలని ఉద్యానశాఖ కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల అధికారి పొకర్ల రిని ఆదేశించారు. బూరుగుపూడి ఆర్బీకేలో బుధవారం కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె ఇటీవలే ఉద్యానవన అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ రాజానగరం, రంగంపేట, అనపర్తి, బిక్కవోల మండలాల అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ ఉద్యానశాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రధానంగా పంట నమోదును వేగవంతం చేయాలన్నారు. రబీ సీజన్‌లో కూరగాయల సాగు విస్తృతంగా జరుగుతోందని, దానికనుగుణంగా నమోదు ప్రక్రియ జరగాలన్నారు. జీడి, మామిడి పండ్ల తోటలు పూతదశలో ఉన్నందున రైతులకు సకాలంలో సూచనలివ్వాలన్నారు.

వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రం ప్రారంభం



బిక్కవోలు వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ జ్యోతిర్మయి

బిక్కవోలు: బిక్కవోలు మండల పరిషత్ కేంద్రం వద్ద వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రం ఏర్పాటు వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఏ ఝాన్సీ మాట్లాడుతూ పంచాయతీల నుంచి వర్మీ కంపోస్టును తీసుకొచ్చి విక్రయానికి ఉంచుతున్నామన్నారు. దీనిపై వచ్చిన ఆదాయాన్ని తిరిగి ఆయా పంచాయతీలకు అందిస్తామని చెప్పారు.

ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2022–23 సవరణ, 2023–24 అంచనా బడ్జెట్‌ను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, తహసీల్దార్ పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు గాదరాడలో గడపగడపకూ

మధురపూడి: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా గురువారం సాయంత్రం 4 గంటలకు గాదరాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. దీనికి ముందుగా మండలంలోని పలు గ్రామాలకు కమిటీల ఏర్పాటు విషయమై పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశం నిర్వహిస్తారు. బూరుగుపూడిలో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల కన్వీనర్ అడపా కనకరాజు కోరారు.

విద్యా క్యాలెండర్ ఆవిష్కరణ




క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పంచాయతీ కార్యాలయం వద్ద గల ఎంపీపీ స్కూల్‌లో పాఠశాల విద్యా క్యాలెండర్‌ను ఎంఈవో కె.స్వామి నాయక్, పంచాయతీ సర్పంచ్ కోండ్రపు ముత్యాలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో స్వామినాయక్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, విద్యావిషయాలను క్యాలెండర్‌తో పొందుపర్చామన్నారు. పాఠశాలల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసేలా క్యాలెండర్‌ను రూపొందించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.భాస్కరరావు, పీఎంసీ చైర్మన్ పి.మాధవి, ఉపాధ్యాయులు ఎస్కే నగీన్‌షా, నరసింహం, బి.సత్యనారాయణ, జీఎల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవీచౌక్ ఆలయ వెండి గోపురం ఆవిష్కరణ

- రూ.30లక్షలు 45 కిలోలతో తయారీ
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో అంతరాలయం వెండి గోపురాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. భక్తుల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు రూ.30 లక్షలతో 45 కిలోల వెండితో దేవీచౌక్‌లోని అంతరాలయానికి వెండి తాపడం చేయించారు. ఈ గోపురాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గోపురం ఆవిష్కరణ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు దాసరి తమ్మన్నదొర, దాసరి రమేష్, సుంకర వీరబాబు, చింతల అనిల్‌కుమార్, సుంకర వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సైతం హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ

గోకవరం: అర్హత ఉంటే చాలు పథకాలన్నీ ఇంటి ముంగిటకు వచ్చి చేరుతాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నూతన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి నూతనంగా పింఛన్ల లబ్ధిదారులకు తినిపించారు. అనంతరం వారికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పింఛనుదారులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏటా రూ.250 పెంచుతూ పోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో అర్హత ఉండి పింఛను పొందాలంటే జన్మభూమి కమిటీ చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. కానీ ప్రస్తుతం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అర్హత ఉండి పింఛను అందని వారు ఉంటే సచివాలయంలో సంప్రదిస్తే వారికి పింఛను అందుతుందన్నారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొర, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, సుంకర వెంకటరమణ, నరాలశెట్టి సర్యయ్య, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్ పాల్గొన్నారు.